

పెద్దమ్మ స్టేజీ వద్ద మంత్రి కాన్వాయ్‌ని తనిఖీ చేస్తున్న పోలీసులు, పక్కన నిలబడిన కేటీఆర్

# కేటీఆర్ కాన్వాయ్ తనిఖీ

**పోలీసులకు సహకారం అందించిన అమాత్యుడు రామన్న**

*సిరిసిల్లలో రోడ్‌షోకు హాజరయ్యేందుకు వెళ్తుండగా, గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ చెక్ పోస్టు వద్ద మంగళవారం సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ వాహన కాన్వాయ్‌ని పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అమాత్యుడు రామన్న కామారెడ్డి నుంచి సిరిసిల్ల వెళ్తుండగా, జిల్లా సరిహద్దున పెద్దమ్మ స్టేజీ వద్ద ఎన్నికల అధికారులు వాహనాన్ని తనిఖీ చేయగా, అమాత్యుడు వారికి పూర్తి సహకారం అందించారు.*

*– గంభీరావుపేట, నవంబర్ 28*

# కాంగ్రెస్‌ను నమ్మితే బతుకులు ఆగమే

ఎన్నికల ప్రచారానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలను పీక్కుతింటున్నరు
- అన్నివర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం
- మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు భారీ బైక్ ర్యాలీ



గన్నేరువరం, నవంబర్ 28: కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజల బతుకులు ఆగమవుతాయని, ఆ పార్టీ పాలించే రాష్ట్రాల్లో పీక్కు తింటున్నారని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులతో కలిసి మండలంలోని గుండ్లపల్లి నుంచి మండల కేంద్రం వరకు 17 కిలోమీటర్ల దూరం బైక్ ర్యాలీ తీశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్‌లో దవాఖానలు పెట్టి దోచుకున్న డబ్బులతో వచ్చి డబ్బు సంచులతో నాయకులను కొనాలని చూస్తున్నారని, కానీ మానకొండూరు ప్రజలను కొనలేరని స్పష్టం చేశారు. అధికారం కోసం కాంగ్రెస్ ఏవో మాయమాటలు చెప్తూ అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాయని, కరెంట్ కావాలో? కాంగ్రెస్ కావాలో? ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ గ్యారెంటీలు ఏమోగానీ ఆర్నెళ్లకు ఒక సీఎం మారుడు పక్కా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రాకముందు వ్యవసాయం దండుగ అన్నారని, పిల్లను కూడా ఇచ్చేటోళ్లుకాదని, కేసీఆర్ వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి రైతును రాజుచేసిండన్నారు. సమైక్య పాలనలో కూలిపని కుడా దొరికేది కాదని, నేడు కూలీలు దొరకడం లేదని తెలిపారు. తాను అభివృద్ధి చేశానని, మరోసారి పట్టం కట్టాలని కోరారు.

# అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్



కారు గుర్తుకు ఓటు వేయాలని చొప్పదండిలో ఓటర్లను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె

చొప్పదండి, నవంబర్ 28 : తాను స్థానికుడినని, అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేశానని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తనను ఆదరించి కారుగుర్తుకు ఓటేసి మరోసారి గెలిపించాలని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. చొప్పదండి పట్టణంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యాపార, వాణిజ్య, గృహాలపై విధిస్తున్న పన్నులను తగ్గిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం చొప్పదండి పట్టణంలోని 12, 13, 14 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో తన స్వగ్రామమైన బూరుగుపల్లిలోనే ఉంటున్నాని, ఎక్కడుంటాడో తెలువని హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేస్తే అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ప్రమాదముందని, ప్రజలు గమనించాలని కోరారు. చొప్పదండి నియోజకవర్గ కేంద్రాన్ని రూ.130 కోట్లతో అభివృద్ధి చేస్తున్నానని, మరోసారి తనకు అవకాశమిచ్చి గెలిపిస్తే సిరిసిల్ల తరహాలో తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

## ఓటుహక్కు వినియోగించుకోవాలి

తెలంగాణ చౌక్, నవంబర్ 28: ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కేంద్ర బలగాలు, జిల్లా పోలీస్ బృందాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు అన్ని ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ సీఐ ఉపేందర్, ఎస్ఐ మల్లేశం, సిబ్బంది ఉన్నారు.



జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న సిబ్బంది



బ్రాహ్మణ వనభోజన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

## అనువంశిక అర్చకుల సమస్యలు పరిష్కరిస్తాం

వేములవాడ, నవంబర్ 28: వేములవాడ పట్టణంలోని అనువంశిక అర్చకులు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, వచ్చే ప్రభుత్వంలో పరిష్కరించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం బ్రాహ్మణ కార్తీక వనభోజన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వేములవాడ సీఎం పర్యటన సందర్భంలో తాను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని, వచ్చే ప్రభుత్వంలో తప్పనిసరిగా సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం వారు సీఎం దృష్టికి తీసుకెళ్లినందున ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీకి సిరిసిల్ల, వేములవాడలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో సైలెంట్ పీరియడ్ మొదలైందని వెల్లడించారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసిందని తెలిపారు. ఇక నుంచి రాజకీయ పార్టీలు ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదన్నారు. స్థానికేతరులు నియోజకవర్గాలను వదిలి వెళ్లాలని ఆదేశించారు. సినిమాలు, సోషల్ మీడియా, టీవీలు, రేడియోలు, కేబుల్ నెట్‌వర్క్‌లో ప్రచారం నిషిద్ధమని చెప్పా రు. అనుమతి పొందిన ప్రకటనలకు మాత్రమే ప్రింట్ మీడియాలో అవకాశం ఉందన్నారు. పోలింగ్ ముగిసిన అరగంట వరకు ఎగ్జిట్ పోల్స్ నిషేధించినట్లు చెప్పారు. ఓటరు స్లిప్పుల్లో పార్టీల గుర్తులు, అభ్యర్థుల పేర్లు ఉండకూడదన్నారు. పోలింగ్ స్టేషన్లలో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించి ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని కోరారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రత చేపట్టామన్నారు. కేంద్ర బలగాలు, పోలీసులు కలిపి 1,600 మంది భద్రతకు వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

